మణిపూర్‌లో మళ్లీ హింస

జిరిబామ్‌లో ఇండ్లకు నిప్పు పెట్టిన మిలిటెంట్లు

ఇంఫాల్, జూన్ 8: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. జిరిబామ్ జిల్లాలో శనివారం కొందరు అనుమానిత మిలిటెంట్లు ఓ పోలీసు ఔట్ పోస్టుతో సహా పలు ఇండ్లకు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో పలు ఇండ్లు కాలిపోయాయని, అయితే కచ్చితమైన సంఖ్య తెలియదని ఓ అధికారి పేర్కొన్నారు. రాత్రి సమయాన్ని ఆసరాగా చేసుకొని మిలిటెంట్లు జిల్లాలోని లంతాయ్ ఖునౌ, మోధుపూర్ ప్రాంతాల్లో దాడులు కూడా చేశారని అధికారులు వెల్లడించారు. తాజా హింస నేపథ్యంలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. మిలిటెంట్ వ్యతిరేక ఆపరేషన్లలో స్థానిక బలగాలకు సహకరించేందుకు మణిపూర్ పోలీసు శాఖకు చెందిన కమాండో దళం జిరిబామ్‌కు తక్షణంగా తరలించారు.

షేర్ మార్కెట్ పతనంపై పిల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత షేర్ మార్కెట్ కుప్పకూలిందని, పెట్టుబడిదారులు నష్టపోయారని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. విచారణ జరిపి, నివేదిక సమర్పించేలా కేంద్రాన్ని, సెబీని ఆదేశించాలని న్యాయవాది అయిన పిటిషనర్ విశాల్ తివారీ కోరారు. స్టాక్ మార్కెట్ కుప్పకూలడం వల్ల పెట్టుబడిదారులు రూ.20 లక్షల కోట్ల మేరకు నష్టపోయారని మీడియా తెలిపిందన్నారు. హిండెన్‌బర్గ్ కేసు నాటికి, ఇప్పటికీ పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని తెలిపారు. భారతీయ మదుపరుల ప్రయోజనాలను కాపాడటానికి కట్టుదిట్టమైన నియంత్రణ విధానం అవసరమని పిటిషనర్ తెలిపారు.

నితీశ్‌ను ప్రధానిని చేస్తామన్నారు

ఇండియా కూటమిపై జేడీయూ నేత త్యాగి సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌కు ప్రధాన మంత్రి పదవి ఇస్తామని 'ఇండియా కూటమి నేతలు ఆఫర్ చేశారని జేడీయూ నేత కేసీ త్యాగి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే ఈ ఆఫర్‌ను జేడీయూ తిరస్కరించిందని తెలిపారు. రానున్న ఐదేండ్లూ తాము ఎన్డీయేతో కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాని పదవికి మోదీని బలపరుస్తూ నితీశ్ ప్రసంగించడంతో ఈ పుకార్లకు తెర పడిందని కేసీ త్యాగి అన్నారు.

'ఎన్డీయే గెలిచిందని వేలు అర్పించాడు'

రాయ్‌పూర్: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో దుర్గేశ్ పాండే అనే ఓ బీజేపీ కార్యకర్త చేతి వేలు నరుక్కొని కాళీ మాతకు సమర్పించాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బలరామ్‌పూర్ జిల్లాలో జరిగింది. ఫలితాల వెల్లడి రోజున తొలుత కాంగ్రెస్ ఆధిక్యంతో ఆందోళన చెందిన దుర్గేశ్.. స్థానిక కాళికాదేవి ఆలయానికి వెళ్లి బీజేపీ గెలుపు కోసం ప్రార్థించాడు.

రాహుల్ జీ.. విపక్ష నేతగా ఉండండి

సీడబ్ల్యూసీ ఏకగ్రీవ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలను చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శనివారం రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసింది. సమావేశం అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ సీడబ్ల్యూసీ విజ్ఞప్తిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని రాహుల్ తమకు తెలిపారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకలకు సీడబ్ల్యూసీ కృతజ్ఞతలు తెలిపింది.

సీపీపీ నేతగా మళ్లీ సోనియా

న్యూఢిల్లీ, జూన్ 8: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) నేతగా సోనియా గాంధీ తిరిగి ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎంపీల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సోనియా పేరును కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపాదించగా.. నేతలు గౌరవ్ గొగోయ్, తారిక్ అన్వర్ బలపరిచారు. ఈ తీర్మానాన్ని ఎంపీలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సోనియా గాంధీ ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న విషయం తెలిసిందే.

బీజేపీకి సీట్లెందుకు తగ్గాయి?

- మోదీ కరిష్మా ఎక్కువగా పని చేయకపోవడం!
- అతి హిందూత్వ ఎజెండాపై ప్రజల్లో వ్యతిరేకత
- సూపర్ మెజారిటీ ప్రమాదమని ఓటర్ల భావన
- విశ్లేషించిన రాజకీయ-ఎన్నికల నిపుణులు

న్యూఢిల్లీ, జూన్ 8: గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా బెంచ్ మార్కు 272ను దాటిన బీజేపీ.. ఈ సారి ఎన్నికల్లో మాత్రం ఆ మార్కును అందుకోలేకపోయింది. 2014 ఎన్నికల్లో 282 సీట్లు, 2019 ఎన్నికల్లో 303 సీట్లు గెలుచుకోగా, 2024 ఎన్నికల్లో మాత్రం 240 సీట్లకే పరిమితమైంది. గత ఎన్నికలతో పోల్చితే, ఈ ఎన్నికల్లో 53 సీట్లను కోల్పోయింది. లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమయ్యాక బీజేపీకి 400 సీట్లు టార్గెట్ అంటూ ప్రచారం చేసిన ఆ పార్టీ నేతలు.. కనీసం 250 మార్కును కూడా అందుకోకపోవటంపై రాజకీయ పండితులు అనేక విశ్లేషణలు చేస్తున్నారు. వాటిని ఒకసారి పరిశీలిస్తే.. మోదీ కరిష్మా, అతి హిందూత్వ అజెండా, సూపర్ మెజారిటీ తదితర కారణాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. 2014, 2019 ఎన్నికల్లో మోదీ కరిష్మాతోనే బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే, ఈ సారి కూడా అదే ఆయుధంతో కమలం పార్టీ బరిలోకి దిగింది. ఎంత మోదీ కరిష్మా ఉన్నా, అభ్యర్థులు, పార్టీ నిర్ణయాలు సరిగా లేకపోతే పరిస్థితులు అనుకూలించవు అని ఈ ఎన్నికలు రుజువు చేశాయని విశ్లేషిస్తున్నారు. ఇక, 'అయోధ్య రామ మందిరం' తమను గెలిపిస్తుందని బీజేపీ నేతలు భావించారు. దేశమంతా వేవ్ ఉంటుందని చెప్పుకున్నారు. హిందూత్వ అజెండా తమకు సీట్లు తెచ్చిపెడుతుందని ఆశించారు. కానీ, తీరా ఫలితాలు చూస్తే హిందూత్వ అజెండా పనిచేయలేదని స్పష్టమవుతున్నదని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల ఓట్లను రాల్చినా, అతి హిందూత్వ అజెండాపై ప్రజలు పెదవి విరిచారని చెప్తున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని విడిచి.. హిందూత్వ అజెండాతోనే గెలుస్తామంటే కష్టమేనని ఈ ఫలితాలు చెప్తున్నాయని అంటున్నారు. అదే సమయంలో బీజేపీ మిత్రపక్షాలు హిందూత్వ వాదాన్ని గట్టిగా వినిపించకపోవటమూ ఓ కారణమని విశ్లేషిస్తున్నారు.

మోదీ ప్రచారం.. బెంగాల్‌లో పరాజయం

లోక్‌సభ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తుంటే అనేక ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీయే ప్రధాన స్టార్ క్యాంపెయినర్‌గా బీజేపీ తరపున ప్రచారం చేశారు. అయితే ఆయన ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని బెంగాల్‌లో చేసిన ప్రచారం ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదని విశ్లేషణలు చెప్తున్నాయి. మోదీ బెంగాల్‌లో 27 లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా, అందులో 20 సీట్లలో బీజేపీ ఓటమి చవి చూసింది. అందులో గతంలో బీజేపీ గెలిచిన ఐదు సీట్లు కూడా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మమత నేతృత్వంలోని టీఎంసీ 29 సీట్లలో నెగ్గగా, అరు సీట్లు తగ్గిన బీజేపీ 12కు మాత్రమే పరిమితమైంది. ఎలాగైనా బెంగాల్‌లో అధిక సీట్లు సాధించాలన్న ధ్యేయంతో మార్చి 1న విజయ్ సంకల్ప్ పేరుతో హుగ్లీలో ర్యాలీతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన మోదీ మే 29న కోల్‌కతాలో మెగా రోడ్‌షోతో ప్రచారాన్ని ముగించారు. మోదీ తన ప్రచారంలో 22 బహిరంగ సభలు, ఒక రోడ్‌షో నిర్వహించినా కమలం పార్టీకి ఓటమి తప్పలేదు. బెంగాల్ నుంచి పోటీ చేసిన కేంద్ర మంత్రులు కూడా ఓటమి బాట పట్టారు. లోక్‌సభ నుంచి సస్పెండైన టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పోటీ చేసిన కృష్ణనగర్‌లో మోదీ రెండుసార్లు ప్రచారం చేసినా బీజేపీ పరాజయంపాలైంది.

కొంప ముంచిన 'చార్ సౌ పార్' నినాదం

బీజేపీకి సొంతంగా 400 మెజారిటీ వస్తుందని ఆ పార్టీ నేతలు ప్రచారంలో వ్యాఖ్యలు చేశారు. ఎక్కడికి వెళ్లినా చార్ సౌ పార్ అంటూ

నినాదాలు చేశారు. ఈ నినాదం కొన్ని వర్గాల్లో భయాందోళనలు కలిగించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మోదీ, అమిత్‌షా తిరుగులేని శక్తులుగా ఎదిగితే, వారు చేసిందే శాసనం అవుతుందన్న భయం ప్రారంభమైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగాన్ని మార్చేస్తారు.. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.. లాంటి ప్రతిపక్షాల ప్రచారాస్త్రాలు దళితులు, మైనారిటీ వర్గాల్లో ఆందోళనలు కలిగించాయని, దాంతో బీజేపీ వారి ఓట్లను దూరం చేసుకొన్నదని రాజకీయ పండితులు అంటున్నారు. ఇక, నిత్యావసరాల ధరలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఉపాధిలేమి సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా నిత్యం హిందూత్వ అజెండానే ముందుకు తీసుకురావటం ఓ వర్గం ఓటర్లలో అసంతృప్తిని పెంచిందని, దాని పర్యవసానమే ఈ ఎన్నికల్లో కనిపించిందని పేర్కొంటున్నారు.

ఐదు నెలల్లో 104 అవినీతి కేసులు

బీజేపీ పాలిత గుజరాత్‌లో ఇదీ పరిస్థితి

అహ్మదాబాద్, జూన్ 8: బీజేపీ పాలిత గుజరాత్‌లో అవినీతి కేసులు పెరిగిపోతున్నాయి. లంచాలకు సంబంధించి ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 104 కేసులను నమోదు చేసినట్టు ఏసీబీ ప్రకటించింది. వీటికి తోడు ప్రభుత్వ ఉద్యోగుల అక్రమాస్తులకు సంబంధించి మరో 10 కేసులు నమోదు చేసి, రూ.25 కోట్ల అక్రమాస్తులను గుర్తించినట్టు వెల్లడించింది. ప్రభుత్వ అధికారులు లంచాలు బాగా డిమాండ్ చేస్తున్నారని వాపోతూ ఏసీబీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేందుకు ఈ ఏడాది జనవరి 26న 'కేర్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏసీబీ ప్రారంభించింది. ఇందులో భాగంగా ఏసీబీ అధికారులు నేరుగా ఫిర్యాదుదారుల ఇండ్లకు వెళ్తున్నారు. అవినీతి, లంచాలపై ఫిర్యాదు చేసినందుకు ఏమైనా వేధింపులు ఎదురవుతున్నాయా అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ దిశగా ఇప్పటివరకు 900 మంది ఫిర్యాదుదారులను కలిసినట్టు గుజరాత్ ఏసీబీ వెల్లడించింది.

నాయకత్వ ఎన్నిక భారతీయుల నిర్ణయం

లోక్‌సభ ఫలితాలపై పాక్ స్పందన

న్యూఢిల్లీ, జూన్ 8: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలపకపోవడంపై పాకిస్థాన్ స్పందించింది. ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి శనివారం ముంతాజ్ జహ్రా బలోచ్ మాట్లాడుతూ దేశ నాయకత్వాన్ని ఎంచుకోవడం అనేది భారతీయ పౌరుల హక్కు అని అన్నారు. భారత ఎన్నికల ప్రక్రియపై తాము ఎలాంటి కామెంట్లు చేయదలచుకోలేదని, అయినా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకముందే భారత ప్రధాని గురించి మాట్లాడటం ముందస్తు చర్య అవుతుందని ఆమె పేర్కొన్నారు. భారత్ సహా తాము అన్ని పొరుగు దేశాలతో స్నేహపూర్వక, సహకార సంబంధాలు కోరుకుంటామని చెప్పుకొచ్చారు. భారత్‌తో సంబంధాలపై బలోచ్ మాట్లాడుతూ అన్ని వివాదాలను నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నామని చెప్పారు.

భారీగా పెరిగిన గుజరాత్ ఎంపీల ఆస్తులు

2019తో పోలిస్తే మూడు రెట్ల పెరుగుదల!

అహ్మదాబాద్: గుజరాత్‌లో వరుసగా రెండోసారి లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన వారి ఆస్తులకు సంబంధించి అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడించింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో 12 మంది రెండోసారి ఎంపీగా ఎన్నికవగా.. వారిలో ఐదుగురి ఆస్తులు 2019 పోలిస్తే 2024 నాటికి 100 శాతానికి పైగా పెరిగాయని పేర్కొన్నది. గత ఐదేండ్లలో ఈ ఐదుగురి ఎంపీల ఆస్తుల విలువ అత్యధికంగా 273 శాతం పెరగ్గా, అత్యల్పంగా 112% పెరిగిందని ఏడీఆర్ నివేదించింది. భారుచ్ నుంచి ఏడుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మన్సుక్ వాసవ ఆస్తులు 2019తో పోలిస్తే 273 శాతం పెరిగాయి. ఆ తర్వాతి స్థానాల్లో పూనమ్మ(246%), రాజేశ్ ఛుడాసమా(208%), దేవుసిన్హ్ చౌహాన్(169%), వినోద్ చావ్డా(112%) ఉన్నారు. మొత్తంగా గుజరాత్‌లో 26 మంది గెలిచిన ఎంపీల్లో 23 మంది మిలియనీర్లు ఉన్నారని తెలిపింది.

మోదీ ప్రమాణ స్వీకారానికి వెళ్లను : మమత

కోల్‌కతా : ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాబోనని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ చీఫ్ మమత బెనర్జీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందిందా? అని మమతను మీడియా అడుగ్గా.. 'నాకు ఆహ్వానం రాలేదు. నేను వెళ్లను' అని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు గురించి మాట్లాడుతూ.. రాజ్యాంగ విరుద్ధ, చట్టవిరుద్ధ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ ఉంటే, తాను శుభాకాంక్షలు చెప్పలేనన్నారు. మూడింట రెండొంతుల ఆధిక్యత సంపాదించాలని మోదీ అనుకున్నారని, అయితే మ్యాజిక్ మార్క్ 272 అయినా బీజేపీకి రాలేదని ఎద్దేవా చేశారు. గతంలో చర్చ జరగకుండానే బిల్లులను ఆమోదించుకునేవారని, ఇప్పుడు అది సాధ్యం కాదని అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వాలని ఇండియా కూటమి నేడు చెప్పలేదని, అంటే దాని అర్థం రేపు చెప్పబోదని కాదన్నారు. మార్పు కోసం ప్రజలు తీర్పు ఇచ్చారని, పరిస్థితిని గమనిస్తున్నామని చెప్పారు. ఇది మోదీ వ్యతిరేక తీర్పు అని, ఆయన పీఎంగా ప్రమాణ స్వీకారం చేయకూడదని అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు లేదు

స్పష్టం చేసిన పళనిస్వామి



చెన్నై, జూన్ 8: తమిళనాడులో బీజేపీతో పొత్తుపై రకరకాలుగా వినిపిస్తున్న ఊహాగానాలను ఏఐఏడీఎంకే జనరల్ సెక్రెటరీ ఇ పళనిస్వామి తోసిపుచ్చారు. 2026 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని, బీజేపీతో పొత్తు ఉండదని శనివారం మీడియా సమావేశంలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఒక్క సీటు కూడా గెలవకపోయినా, ఓటింగ్ శాతం 19 నుంచి 20 శాతానికి పెరిగిందని ఆయన అన్నారు. అయితే ఈ ఎన్నికల్లో ఎదురైన ఓటమికి కృంగిపోమని, తాము తిరిగి పుంజుకుంటామని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, 2023లోనే తాము బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏతో తెగతెంపులు చేసుకున్నామని, కేవలం ఎన్నికల్లో గెలవడానికే తప్ప తమిళనాడు ప్రజలకు ప్రయోజనం కలిగించే ఉద్దేశం బీజేపీకి లేదని తెలిసి తాము అందులోంచి బయటకు వచ్చామని తెలిపారు. బీజేపీ నుంచి ఈ ఎన్నికల్లో దూరంగా ఉన్నామని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇదే వైఖరిని కొనసాగిస్తామని తెలిపారు. ఇక్కడ బీజేపీ తన ప్రాబల్యం పెంచుకుందన్న మాటల్లో నిజం లేదన్నారు. '2014లో ఎన్డీయేకు దక్కిన ఓట్లు 18.8 శాతం, 2024లో దక్కింది 18.28 శాతం. ఏఐఏడీఎంకే ఓట్లు బీజేపీకి బదిలీ కాలేదనడానికి ఇదే నిదర్శనం' అని అన్నారు. మూడోసారి ప్రమాణ స్వీకారం చేయబోతున్న ప్రధాని మోదీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మోదీకి ఇద్దరు ఉద్ధవ్ వర్గ ఎంపీల మద్దతు!

షిండే వర్గం ఎంపీ సంచలన వ్యాఖ్య



ముంబై, జూన్ 8 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) సంచలన వ్యాఖ్యలతో రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ, షిండేపై ఆగ్రహంతో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు తిరిగి ఉద్ధవ్ ఠాక్రే పార్టీలోకి చేరేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో షిండే నేతృత్వంలోని శివసేన వర్గం అధికార ప్రతినిధి నరేష్ మాస్కే విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో శివసేన (యూబీటీ) నుంచి గెలిచిన తొమ్మిది మందిలో ఇద్దరు ఎంపీలు తమను సంప్రదించారని తెలిపారు. నరేంద్ర మోదీకి మద్దతు ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కారణంగా ఆ ఇద్దరి పేర్లు తాను బయటపెట్టబోనని తెలిపారు. ఉద్ధవ్‌కు తమపై నమ్మకం లేదని, తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం మోదీకి మద్దతిస్తామని వారు తనతో చెప్పారని ఆయన తెలిపారు. ఓ సామాజిక వర్గం వారిని ఉద్ధవ్ ఓట్లు అడిగిన తీరు ఆ ఎంపీలకు నచ్చలేదన్నారు. ఆ వర్గం వారు బస్సుల్లో పెద్ద సంఖ్యలో వచ్చి ఓట్లు వేశారని చెప్పారు. నరేష్ వ్యాఖ్యలతో ఉద్ధవ్ వర్గంలో అలజడి రేగింది. ఆ ఇద్దరు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, నరేష్ వ్యాఖ్యలను శివసేన (యూబీటీ) నాయకురాలు సుష్మా అంధారే తోసిపుచ్చారు. నరేష్ మాస్కే పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

మరాఠా రిజర్వేషన్ల కోసం మళ్లీ నిరాహార దీక్ష

- ఇవ్వకపోతే అసెంబ్లీకి పోటీ చేస్తానన్న జరాంగే

ముంబై, జూన్ 8: మహారాష్ట్రలో 'మరాఠా రిజర్వేషన్ల' ఉద్యమం మళ్లీ మొదలైంది. సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే శనివారం ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. అయితే ఆయన నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈసారి మరాఠా రిజర్వేషన్లను ప్రభుత్వం అమల్లోకి తీసుకురాకపోతే అక్టోబర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని జరాంగే ప్రకటించారు. జూన్ 4లోగా రిజర్వేషన్ల అంశాన్ని తేల్చకపోతే తిరిగి నిరాహార దీక్షను మొదలుపెడతానని ఇంతకు ముందే ఆయన ప్రకటించారు. మరాఠా రిజర్వేషన్ల కోసం రాష్ట్ర సర్కార్, విపక్ష మహా వికాస్ అఘాడీ ఏమీ చేయటం లేదని ఆయన విమర్శించారు. శివసేన (షిండే) నేతృత్వంలోని సర్కార్ రిజర్వేషన్ల అంశాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని, మహా వికాస్ అఘాడీ అధికారంలో ఉండగా కూడా అదే పని చేసిందని జరాంగే ఆరోపించారు. ఈ ఏడాది ఆరంభంలో 17 రోజులపాటు జరాంగే ఆమరణ నిరాహార దీక్ష రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతను తీసుకొచ్చింది. దీంతో మరాఠాలకు 10శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ మహారాష్ట్ర సర్కార్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీలో బిల్లును తీసుకొచ్చింది. అయితే ఓబీసీ విభాగం కింద రిజర్వేషన్లు కల్పించడాన్ని జరాంగే వ్యతిరేకించారు.

యోగికి ఎసరు పెడుతున్నారా?

- ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి భారీగా తగ్గిన ఎంపీ సీట్లు
- ఇది సాకుగా చూపి సీఎం యోగికి చెక్ పెడతారా?
- ఈ దిశగానే ఫడ్నవీస్ రాజీనామా ప్రకటన ?
- ఎన్నికల తర్వాత యోగిని తప్పిస్తారన్న కేజ్రీవాల్
- ఇందుకు అనుగుణంగానే ప్రస్తుత పరిణామాలు

లక్నో, జూన్ 8: బీజేపీకి కంచుకోటగా భావించిన ఉత్తరప్రదేశ్‌లో ఈసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. కమలం పార్టీకి ఎదురులేదనుకున్న రాష్ట్రంలో పరాభవం ఎదురైంది. ఆ పార్టీ దాదాపు సగం స్థానాలను కోల్పోయింది. ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా మ్యాజిక్ ఫిగర్ అందుకోకపోవడానికి కూడా యూపీలో ప్రతికూల ఫలితాలే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో ఈ వైఫల్యానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను బాధ్యుడిని చేయవచ్చనే అనుమానాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. యూపీ ఫలితాలను సాకుగా చూపి భవిష్యత్తు ప్రధానిగా బీజేపీ శ్రేణులు భావించే యోగి ఆదిత్యనాథ్‌కు ఎసరు పెట్టవచ్చని అంటున్నారు. తాజాగా జరుగుతున్న పరిణామాలు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా ప్రకటన యోగి ఆదిత్యనాథ్‌కు చెక్ పెట్టేందుకేననే వాదనలు వినిపిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో ఊహించని ఎదురుదెబ్బలు

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు యూపీలో బీజేపీకి ఎదురు లేదని అంతా భావించారు. ఎగ్జిట్ పోల్స్ కూడా ఇదే చెప్పాయి. అయితే, ప్రజాతీర్పు మాత్రం అందరినీ ఆశ్చర్య పరిచింది. 2019లో 62 స్థానాలు సాధించిన బీజేపీ ఇప్పుడు కేవలం 33 స్థానాలకే పరిమితమైంది. 2019లో 49.6 శాతం ఓట్లు సాధించిన బీజేపీ ఈసారి 41.4 శాతానికి పడిపోయింది. ఈసారి బీజేపీ 49 మంది సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వగా 27 మంది ఓడిపోయారు. కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ(అమేథీ), అజయ్ మిశ్రా(ఖేరి), మహేంద్రనాథ్ పాండే(చందౌలి), ఎనిమిది సార్లు ఎంపీగా పనిచేసిన మేనకా గాంధీ(సుల్తాన్‌పూర్), మాజీ ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్ కుమారుడు రాజ్‌వీర్ సింగ్(ఎటా) తదితర ప్రముఖ బీజేపీ నేతలు ఓడిపోయారు.

టికెట్ల కేటాయింపే తప్పు: యోగి వర్గీయులు

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వైఫల్యానికి కారణాలేంటి ? బాధ్యులు ఎవరు ? అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఉత్తరప్రదేశ్ చుట్టూ ఉన్న ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, బీహార్, జార్ఖండ్‌లో మంచి ఫలితాలు సాధించిన బీజేపీ యూపీలో మాత్రం ప్రతికూల ఫలితాలు సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలే కారణమనే వాదన తెర మీదకు వచ్చింది. యూపీలో వరుసగా జరిగిన ప్రశ్నా పత్రాల లీకేజీలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల వాయిదాలు, పెరిగిపోయిన నిరుద్యోగం, వంటి అంశాలు ఎన్నికల్లో బీజేపీకి నష్టం చేశాయనే విశ్లేషణలు ఉన్నాయి. వీటన్నింటికీ ముఖ్యమంత్రి యోగిని బాధ్యుడిని చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే భావన వ్యక్తం అవుతున్నది. అయితే, యోగి వర్గీయులు మాత్రం అభ్యర్థుల ఎంపికలో కేంద్ర నాయకత్వం తప్పిదమే ఈ ఫలితాలకు కారణమని అంటున్నారు.

ఫడ్నవీస్ రాజీనామా వెనుక వ్యూహమిదేనా ?

యూపీలో ఓటమిని యోగిపైకి నెట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు కనిపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల ముందు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు తెరపైకి వచ్చాయి. బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే యోగిని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పిస్తారని ఆయన ఆరోపించారు. మోదీ రిటైరైతే ప్రధాని పదవికి అమిత్ షాకు పోటీ ఉండకుండా చూసుకునేందుకు యోగిని పక్కనపెడతారని ఆయన అప్పుడు జోస్యం చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు ఈ దిశగానే ఉన్నాయనే భావన వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా ప్రకటన వెనుక వ్యూహం ఉందనే వాదన తెరమీదకు వచ్చింది. మహారాష్ట్రలో బీజేపీ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ తాను పదవికి రాజీనామా చేస్తానని ఫడ్నవీస్ ప్రకటించారు. అయితే, యోగి ఆదిత్యనాథ్ కూడా రాజీనామా చేసేలా ఒత్తిడి తెచ్చే వ్యూహంతోనే ఫడ్నవీస్ ఈ ప్రకటన చేశారని శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. యూపీలో 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ ఎన్నికలకు బీజేపీ కచ్చితంగా యోగి సారథ్యంలోనే వెళ్తుందని చెప్పలేమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజ్వల్ ఇంటికి సిట్

సెక్స్ స్కాండల్ కేసులో ఆధారాల అన్వేషణ

హసన్, జూన్ 8: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ కేసులో ఆధారాల సేకరణపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) దృష్టి సారించింది. ఈ మేరకు శనివారం హోలెనర్సిపూర్ ఉన్న ప్రజ్వల్ ఇంట్లో సిట్ అధికారులు పలు ఆధారాలు సేకరించారు. ఆ సమయంలో సిట్ అధికారుల వెంట ప్రజ్వల్ కూడా ఉన్నారు. కాగా, సొంత ఊరికి ప్రజ్వల్‌ను తీసుకువెళ్లిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మీడియాను సైతం అనుమతించలేదు. ప్రస్తుతం ప్రజ్వల్ రేవణ్ణ సిట్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే.

ఉక్రెయిన్ దాడుల్లో 28 మంది మృతి

కీవ్, జూన్ 8: రష్యా-ఉక్రెయిన్ పరస్పర దాడుల్లో అనేకమంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఖేర్సన్, లుహాన్స్క్ (రష్యా ఆక్రమిత ప్రాంతం)లో ఇరు దేశాలు పరస్పరం డ్రోన్ బాంబు దాడులను చేపట్టగా, ఈ యుద్ధంలో సదోవా అనే చిన్న పట్టణం నలిగిపోయింది. ఉక్రెయిన్ బలగాలు శుక్రవారం జరిపిన క్షిపణి, బాంబు దాడుల్లో 28 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, మరో 60 మంది పౌరులు తీవ్రంగా గాయపడ్డారని మాస్కో ఆధీనంలో పనిచేస్తున్న గవర్నర్ వ్లాదిమిర్ సాల్డో శనివారం ప్రకటించారు. అమెరికా 'హిమార్స్' మిస్సైళ్లు, ఫ్రాన్స్ తయారీ గైడెడ్ బాంబులతో ఉక్రెయిన్ బలగాలు విరుచుకుపడ్డాయని సాల్డో చెప్పారు. సదోవా పట్టణంపై ఉక్రెయిన్ ఉద్దేశపూర్వకంగా పదే పదే దాడులకు తెగబడిందని, పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయని ఉక్రెయిన్ ఈ దాడిని చేపట్టిందని ఆయన ఆరోపించారు. బాంబు దాడులతో భవనాలు కుప్పకూలగా, శిథిలాల కింద చిక్కుకున్న మరో రెండు మృతదేహాలను శనివారం వెలికి తీశామని ఆయన చెప్పారు.

మళ్లీ వాట్సాప్ నుంచి ఎస్‌ఎంఎస్‌కు..

- ఓటీపీల విషయంలో మారిన టెక్ కంపెనీల వైఖరి
- వాట్సాప్ మెసేజ్‌ల ధరలు ఎక్కువ కావడమే కారణం



హైదరాబాద్, జూన్ 8: తమ వినియోగదారులకు వాట్సాప్ ద్వారా ఓటీపీలు పంపించే విధానాన్ని అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి బడా టెక్ కంపెనీలు క్రమంగా విరమించుకుంటున్నాయి. మళ్లీ పాత పద్ధతిలోనే ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ఓటీపీలను పంపించేందుకు మొగ్గు చూపుతున్నాయి. దీంతో మార్చి నెల నుంచి భారత్‌లో అంతర్జాతీయ ఎస్‌ఎంఎస్‌లు దాదాపు 50 నుంచి 70 శాతం పెరిగాయి. ఇటీవలి కాలంలో వాట్సాప్ కొత్తగా 'అథెంటికేషన్ - ఇంటర్నేషనల్' అనే కొత్త కేటగిరీని ప్రారంభించింది. దీని ద్వారా భారత్, ఇండోనేషియాలోని వినియోగదారులకు ఓటీపీలు పంపించే అంతర్జాతీయ సంస్థల నుంచి ఒక్కో మెసేజ్‌కు రూ.2.3 వసూలు చేస్తున్నది. గతంలో వాట్సాప్ వసూలు చేసిన ధర కంటే ఇది దాదాపు 20 రెట్లు ఎక్కువ. అయితే, అంతర్జాతీయ ఎస్‌ఎంఎస్ ఛార్జీలతో పోలిస్తే ఇది సగం మాత్రమే. అయినప్పటికీ క్రమంగా టెక్ సంస్థలు ఎస్‌ఎంఎస్‌ల(సంక్షిప్త సందేశాలు) వైపు మళ్లుతున్నాయి. ఇలా ఎస్‌ఎంఎస్‌ల వైపు టెక్ కంపెనీలు మొగ్గు చూపడానికి ధర ఒక కారణమైతే, వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటాతో ఈ సంస్థలకు వ్యాపారపరమైన పోటీ ఉండటం కూడా మరో కారణమని టెక్ నిపుణులు చెప్తున్నారు.

ఇజ్రాయెల్ దాడిలో 210 మంది మృతి!

హమాస్ చెర నుంచి నలుగురు బందీల విడుదల

గాజా, జూన్ 8: పలు ప్రపంచ దేశాలు, ఐరాస వారిస్తున్నా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం సెంట్రల్ గాజాలోని ఒక శరణార్థి శిబిరంపై జరిగిన దాడిలో 210 మంది మరణించారు. ఈ దాడి సందర్భంగా హమాస్ చెరలో బందీగా ఉన్న నలుగురు ఇజ్రాయెల్ పౌరులను రక్షించినట్టు అధికారులు తెలిపారు. నుసిరత్ శిబిరంపై దాడిలో 210 మంది మరణించగా, 400 మంది గాయపడ్డారని హమాస్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. కాగా, నుసిరత్‌లోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్టు ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. అయితే ఇజ్రాయెల్ దాడులకు తామ భయపడేది లేదని, ప్రతిదాడులు చేస్తూనే ఉంటామని హమాస్ నేత ఇస్మాయెల్ హనియెహ్ పేర్కొన్నారు.



మరో స్కూల్‌పై దాడి

ఉత్తర గాజాలో ఐరాస నడుపుతున్న ఓ బడిపై ఇజ్రాయెల్ దళాలు శుక్రవారం దాడి చేశాయి. హమాస్ ఉగ్రవాదులు ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలిపింది. ఈ దాడిలో ముగ్గురు మరణించినట్టు పాలస్తీనా అధికారులు చెప్పారు. ఇజ్రాయెల్ గురువారం సెంట్రల్ గాజాలోని ఓ బడిపై జరిపిన దాడిలో 33 మంది మరణించిన సంగతి తెలిసిందే.

డెన్మార్క్ ప్రధానిపై దుండగుడి దాడి

ఎన్నికల వేళ ఆందోళనకరంగా దాడులు



న్యూఢిల్లీ: డెన్మార్క్ ప్రధాని మెట్ ఫ్రెడెరిక్సెన్‌పై శుక్రవారం ఆ దేశ రాజధాని కోపెన్‌హాగన్ లోని కల్టోర్వెట్‌లో దాడి జరిగింది. దాడి చేసిన దుండగుడిని పోలీసులు అరెస్ట్ చేశారని ప్రధాని కార్యాలయం పేర్కొంది. ఇతర వివరాలను వెల్లడించలేదు. ప్రధానికి వ్యతిరేక దిశ నుంచి వచ్చిన దుండగుడు ఆమె భుజాలను పట్టుకుని బలంగా నెట్టేయడంతో ఫ్రెడెరిక్సెన్ కిందపడిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెప్పున్నారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికల వేళ రాజకీయ నేతలపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. మే 15న స్లొవేకియా ప్రధాని ఫికోపై కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే.

హింస ప్రోత్సాహాన్ని అనుమతించం

ఇందిర హత్య పోస్టర్లపై కెనడా

ఒట్టావా: హింసను ప్రోత్సహించడాన్ని కెనడాలో ఎంతమాత్రం అనుమతించబోమని ఆ దేశ ప్రజా భద్రతా వ్యవహారాల శాఖ మంత్రి లెబ్లాంక్ స్పష్టం చేశారు. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యను వర్ణిస్తూ వాంకోవర్ నగరంలో పలు చోట్ల పోస్టర్లు వెలియడంపై ఆయన తాజాగా ఎక్స్‌లో స్పందించారు. ఈ పోస్టర్లను ఖలిస్థాన్ మద్దతుదారులు ఏర్పాటు చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై భారత సంతతికి చెందిన చట్టసభ్య సభ్యుడు చంద్ర ఆర్య ఆందోళన వ్యక్తం చేశారు. ఖలిస్థాన్ మద్దతుదారులు హిందూ కెనడియన్స్‌లో భయం సృష్టించాలని చూస్తున్నారని అన్నారు.

మైనర్లు చూసే సోషల్ మీడియా పోస్ట్‌లపై ఆంక్షలు

బిల్లును ఆమోదించిన న్యూయార్క్

అల్బనీ (అమెరికా): కొన్ని సోషల్ మీడియా పోస్టులను చూడటం, చదవడం మైనర్ బాలలకు దురలవాటుగా మారుతున్నది. అటువంటి పోస్టులు వారికి చేరకుండా వారి తల్లిదండ్రులు బ్లాక్ చేయడానికి అవకాశం కల్పించే బిల్లును న్యూయార్క్ స్టేట్ లెజిస్లేచర్ శుక్రవారం ఆమోదించింది. బాలలకు హాని కలిగించే కంటెంట్‌ను కట్టడి చేయడమే ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లుపై గవర్నర్ కేథీ హోచుల్ సంతకం చేస్తే, చట్టంగా అమల్లోకి వస్తుంది. కొన్ని రకాల పోస్టులను బాలలకు అర్ధరాత్రి నుంచి ఉదయం 6 గంటల లోపు పంపించరాదని ఈ బిల్లు చెప్తున్నది. నిర్దేశిత పోస్టులను 18 సంవత్సరాల వయసు లోపు గలవారికి పంపించకూడదని తెలిపింది. అయితే టెక్ ఇండస్ట్రీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.